క్లుప్తంగా

ఆలయ ఆవరణలో సీసీ నిర్మాణం



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులోని సాయిబాబా ఆలయ ఆవరణ అంతా కంకర తేలి భక్తులకు ఇబ్బందికరంగా తయారైంది. దీంతో విక్రంరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జి. మాణిక్ రెడ్డి తన సొంత నిధులతో ఆలయ ఆవరణ అంతా సీసీ వేయించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్డు సమాంతరంగా వేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తులు, ఆలయ అర్చకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఏఈ



కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్

ఆల్విన్‌కాలనీ: కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ శనివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, కిషన్, పోశెట్టి గౌడ్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షన్నర సైబర్ మోసాలపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు

మోతీనగర్: సైబర్ మోసాల్లో బాధితులు రూ.లక్షన్నర పోగొట్టుకున్నా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సీఐ సామల వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. గతంలో రూ.50 వేల వరకు జరిగే మోసాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించేవారని తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు 117 మెడల్స్

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిరి జిల్లాకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో 117 మెడల్స్ వచ్చినట్లు జిల్లా క్రీడల అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 37 గోల్డ్, 42 సిల్వర్ 42, 38 బ్రాంజ్ వచ్చాయన్నారు. గెలుపొందిన మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.75 వేలు, మూడో విజేతకు రూ.50 వేల నగదు అందజేస్తారన్నారు. అలాగే వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు రూ. 20 వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో విజేతకు రూ. 10 వేలు నగదు రూపంలో సీఎం కప్–2024తో పాటుగా అందజేస్తారన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్‌లలోని 203 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 3లక్షల ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాజు యాదవ్, గౌతమ్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, అన్వర్ షరీఫ్, ప్రతాప్‌రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1.2 కిలోల గంజాయి స్వాధీనం

కుత్బుల్లాపూర్: ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో గాజులరామారంలోని అంబేడ్కర్‌నగర్‌లో శనివారం 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్‌టీఎఫ్ టీం దాడులు నిర్వహించగా.. మహ్మద్ సలాం అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది, దీని వెనుక ఇంకా ఎవరు ఉన్నారనే కోణంలో ఆరా తీస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా
రోడ్డు భద్రతా మాసోత్సవాలు

జిల్లా కలెక్టర్ గౌతమ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, ఇతర అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాలను నివారించటానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవటంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచటానికి విద్యా సంస్థలతో సహా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలని విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, రోడ్లు భవనాల శాఖ ఈఈ శ్రీనివాస్ మూర్తి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లాలో తలపెట్టిన రోడ్డు భద్రతా మాసోత్సవాలని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా, మండల హెడ్ క్వార్టర్‌లో భారీ ర్యాలీ చేపట్టాలన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రోడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రతా కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి తెలిపారు.


పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు చేరవేయటంలో అధికారులు, ఉద్యోగుల పాత్ర గణనీయమైందని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో 'టీజీఓఎస్–2025' కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండటంతోపాటు మేడ్చల్ జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు పాత్రను ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించటం ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకోవటానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీజీఓఎస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి కురుమూర్తి, జిల్లా అసోసియేషన్ నేతలు విజయకుమారి, రవీందర్, రఘునాథన్‌గౌడ్, సాయికృష్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- గుంతలమయంతో రాకపోకలకు తిప్పలు
- పట్టించుకోని అధికారులు





మల్లికార్జున నగర్ రోడ్డు నంబర్ 2 వరకు అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది. వెస్లీ టీచర్స్ కాలనీ నుంచి మల్లికార్జున నగర్ రోడ్డు నంబర్ 2 వరకు సమస్య తీవ్రంగా ఉంది. పీవీ ఎన్‌క్లేవ్, గౌరినగర్, సమతానగర్ కాలనీలతో పాటు మరికొన్ని ప్రాంతాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేసి రాకపోకలు సులువుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నయనానందకరంగా నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: ఒడిస్సీ నృత్యం సందర్శకులను ఆకట్టుకుంది. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం వక్రతుండ, అభినయ, స్థాయి, మేఘ, పల్లవి, శబరి పల్లవి, బసంత్ పల్లవి, దుర్గస్తుతి, జగన్నాథ్ అష్టకం తదితర అంశాలను ఒడిస్సీ కళాకారులు తృప్తి, సుధాసాహు, దర్వి, ఇనాయ, చార్వి, అక్షిత, వర్ష పాండ, సుకన్య తదితరులు ప్రదర్శించారు.

కూచిపూడి నృత్యార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా గురుకులం మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ కూచిపూడి నృత్య గురువు పోపూరి లక్ష్మి తులసి శిష్య బృందం నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కళాకారులు పోకూరి షణ్ముఖ వేద, శ్రీకృతి, అఖిల, సన్నుతి, ఆద్య, చిందా అలేఖ్య, కృతి, సంహిత, హర్షిత, చక్రిక, భవ్య, భావికలు.. ఆనందనర్తన గణపతి, కొలువైతివా రంగసాయి, తక్కువేమి మనకు, అలరులు కురియగా, ముద్దుగారే యశోద, పలుకు తేనెల తల్లి, నారాయణతే అంశాలను ప్రదర్శించారు.

జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయికిషోర్

జీడిమెట్ల: జీడిమెట్లలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసి జీడిమెట్ల ఇండస్ట్రియల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సాయికిషోర్, వైస్ ప్రెసిడెంట్‌గా రంగరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాసులురెడ్డి, ట్రెజరర్‌గా డి.కరుణ్, సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్‌పటేల్, సౌమ్య, శ్రీనివాసరాజు, జీకే చౌదరి, భాస్కరరాజు, శ్రీనివాసరాజు, అభినవకుమార్‌రెడ్డి, కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రెసిడెంట్ సాయికిషోర్ మాట్లాడుతూ.. తన విధులను బాధ్యతగా నెరవేరుస్తూ పారిశ్రామికప్రాంత అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని అన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

భాష్యం పాఠశాల 24వ వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆల్విన్‌కాలనీ: భాష్యం పాఠశాలలో 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీఫ్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, భాష్యం పూర్వ విద్యార్థిని డాక్టర్ రోషిణి పాల్గొన్నారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థి దశ నుండే దేశ భక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. టాపర్స్‌కి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సీఈఓ చైతన్య, జెడ్ ఈఓ శిరీష, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ అర్చన



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు

మూసాపేట: ధనుర్మాసం సందర్భంగా భరత్‌నగర్ కాలనీ హరిహర క్షేత్రంలో రామాలయంలో రాముల వారికి లక్ష తులసీ అర్చన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పి. నాగిరెడ్డి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సంతోష్, కర్క రవీందర్, సోమయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

బాలాజీనగర్ డివిజన్ టి. అంజయ్య నగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఖాజా పటేల్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు మాజీ కార్పొరేటర్ బాబూరావుతో కలిసి శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, మున్నా, కన్నయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న ఏఈ వర్షిణి, మురళి తదితరులు

మోతీనగర్: గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ప్రజా పాలన ద్వారా ప్రజల నుంచి ఆరు సంక్షేమ పథకాల గురించి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగానే రెండు రోజుల నుంచి మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట, పాండురంగ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ఇళ్లకు అధికారులు వెళ్లి పరిశీలించారు. దరఖాస్తుదారుని అప్లికేషన్, ఆధార్, వాటర్, కరెంటు బిల్లు తదితర బిల్లులను పరిశీలించారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, రేకుల షెడ్డా?, వారికి ఖాళీ ప్రదేశం ఉందా? అని దరఖాస్తుదారుడితో ఫొటోలు తీస్తూ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ వర్షిణి, ఆర్గనైజర్ కొండబత్తిని మురళి, ఎస్ఎఫ్ఏ, బిల్ కలెక్టర్లు, రిసోర్స్ పర్సన్‌లు చురుగ్గా పాల్గొంటున్నారు.

యోగా భవనానికి లిఫ్ట్ ప్రారంభం



లిఫ్ట్‌ను ప్రారంభించిన పీఏసీ చైర్మన్ గాంధీ, సీనియర్ సిటిజన్లు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని వినాయక పార్కులో సీనియర్ సిటిజన్స్, యోగా భవనానికి వచ్చే వారి సౌకర్యార్థం పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ సొంత నిధులతో లిఫ్ట్‌ను నిర్మించారు. శనివారం లిఫ్ట్‌ను గాంధీ ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు, సీనియర్ సిటిజన్స్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శనివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్ నగర్‌ఫేజ్ 1, 2, కృష్ణవేణి కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీల్లో అధికారులు, కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, లైన్‌మెన్ సాయి ప్రశాంత్ నగర్ ఫేజ్ 1, 2, కృష్ణవేణి కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడి ఎన్నికపై అభిప్రాయ సేకరణ



అభిప్రాయ సేకరణలో సూర్యారావు, నాయకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ నూతన అధ్యక్షుడి నియామకానికి అభిప్రాయ సేకరణ శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యారావు ఇన్‌చార్జిగా పాల్గొని అభిప్రాయ సేకరణ చేశారు. ఇందులో భాగంగా శక్తి కేంద్రాలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ నిర్వహించారు.

సర్వే పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న బండి రమేష్, యాదగిరి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులు చేస్తున్న సర్వే తీరును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి పరిశీలించారు. శనివారం అబ్రహాం‌నగర్‌లో పరిశీలించి ఇంటింటికీ తిరిగి వివరాలు తెలుసుకున్నారు. గతంలో అధికారుల నిర్లక్ష్యంతో సర్వే సరిగా జరగడం లేదని ప్రజలు ఆయనకు ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సర్వే సజావుగా సాగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, నాయకులు యాదగిరి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సతీష్‌రెడ్డి, రాజేందర్, అస్లాం సోఫీ, సందీప్, అంజద్, షాయిన్‌షా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్



.. శ్రీసాయి విద్యానికేతన్ కరస్పాండెంట్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: మహాలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ సంస్థ నూతన సంవత్సర కేలండర్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్ , ముద్దం మహేష్ యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, సాయిబాబాయాదవ్, మల్లికార్జునయాదవ్, శేఖర్‌యాదవ్, వెంకట్ యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, మన్నే ఉదయ్‌యాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి విద్యానికేతన్ కేలండర్ ఆవిష్కరణ

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ప్రగతి నగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్‌లో పాఠశాల నూతన సంవత్సరం కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.